ప్రజాశక్తి
శుక్రవారం 10 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రమాదంలో మృతి చెందిన పవన్‌కుమార్

పాలకొండ రూరల్ : స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసరి పవన్ కుమార్ (20) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు రోడ్డు పక్కన ఉన్న పవన్‌కుమార్‌ను పాలకొండ నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పవన్‌కుమార్ పట్టణంలో గాయత్రీ ఒకేషన్ డిగ్రీ చదువుతున్నాడు. పవన్ స్వగ్రామం సంతకవిటి మండలం కృష్ణయ్యవలస. ఎస్ఐ శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని

కలెక్టరేట్ వద్ద వామపక్షాల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వం వేధింపులు ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సకాలంలో జీతాలు ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద వామపక్షాలు ధర్నా చేశాయి. తొలుత స్థానిక సుందరయ్య భవనం (సిపిఎం కార్యాలయం) నుంచి సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ లిబరేషన్, వామపక్ష నాయకులు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, లిబరేషన్ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మధరావు, భాస్కర రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. నెలనెలా జీతాలు ఇచ్చే పరిస్థితిలో లేదని, వారి సమస్యలు పరిష్కరించాలని అడిగితే ఉద్యోగులపై నిర్బంధం, వేధింపులు, దౌర్జన్యం చేయడం అన్యాయమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, ఏళ్ల తరబడి పెండింగ్ డిఎ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని కోరారు. నాయకులు భాస్కరరావు, గౌరి నాయుడు మాట్లాడుతూ ఉద్యోగులపై వేధింపులను ఖండించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు టి.జీవ, సూరయ్య, జివి రమణ, కె.రామస్వామి, ఆర్.శ్రీదేవి, వి.ఇందిర, మండల, పట్టణ నాయకులు ఉమా, కృష్ణ, కె.రాజు, రాజశేఖర్, రాము, ప్రజా సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా నిబంధనలు అమలు : కలెక్టర్

ఓటింగు విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

శాసనమండలి పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల్లో నిబంధనలు పక్కాగా అమలు చేయాలని, ఓటింగు విధానంపై ఓటర్లకు ముందుగానే అవగాహన కల్పించాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ పోలింగు అధికారులను ఆదేశించారు. గురువారం పోలింగు అధికారులు, సహాయ పోలింగు అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ బాక్సు నిర్వహణను సంపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. అనుమానా లుంటే ముందుగానే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగు కేంద్రానికి ముందు రోజే చేరుకొని, అక్కడే అధికారులు ఏర్పాటు చేసిన వసతిలోనే బసచేయాలన్నారు. ముందురోజే పోలింగు ఏర్పాట్లు చేసుకోవాలని, ఉదయం 6.30 గంటలకల్లా పోలింగుకు సిద్ధం కావాలని, 8గంటలకు పోలింగు ప్రారంభించి, సాయంత్రం 4 గంటలకు ముగించాలని చెప్పారు. పోలింగు ఏజెంట్లకు అభ్యర్థి ఇచ్చిన లేఖ, వారి గుర్తింపు సరిచూసుకోవాలని, పోలింగు కేంద్రంలో ఏజెంట్లు వారికి కేటాయించిన స్థానంలోనే ఉండాలని, ఎటూ తిరగకూడదన్నారు. పోలింగు బూత్ లోనికి అనుమతి లేకుండా ఇతర సిబ్బంది, పోలీసు అధికారులు ప్రవేశించకూడదని తెలిపారు. ఓటర్లు ఎన్నికల కమిషన్ తెలియజేసిన ఏదేని గుర్తింపు కార్డు తీసురావాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగు విధానం సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉంటుందని, ఓటు వేసేందుకు సాధారణం కంటే ఎక్కువ సమయం పడుతుందని, కావున దీనిపై ఓటర్లకు ముందుగానే అవగాహన కల్పిస్తే, ఓటరుకు ఓటింగు సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఓటర్లు పోలింగు సిబ్బంది అందజేసిన పెన్నుతోనే ఓటు వేయాలన్నారు. దృష్టి లోపం గల ఓటరు ఎవరైనా సహాయకులతో వస్తే, వారి నుంచి డిక్లరేషను తీసుకొని అనుతించాలని తెలిపారు. డిఆర్ఒ జె.వెంకటరావు పోలింగు అధికారులకు పోలింగు ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఆర్‌డిఒ కె.హేమలత, పోలింగు అధికారులు, సహాయ పోలింగు అధికారులు పాల్గొన్నారు.

పోలింగుకు ఏర్పాట్లు పూర్తి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని, ఎన్నికలకు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్యాలెట్ బాక్సులు సీల్ చేసినప్పుడు, ఓపెన్ చేసే సమయాల్లో వీడియో తప్పనిసరిగా తీయించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధానంపై పోలింగు అధికారులకు, సహాయ పోలింగు అధికారులకు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూమ్‌లకు పంపేందుకు రవాణా సదుపాయాలను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ మద్యం షాపుల మూసివేత

ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 11న సాయంత్రం 4గంటల నుంచి 13న పోలింగు ముగిసే వరకూ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో మద్యం షాపులను మూసివేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలింగు ముసిగే వరకూ "డ్రై డేస్" పాటించాలని అన్నారు. అన్ని రిటైల్ అవుట్ లెట్స్, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని కలెక్టరు ఆదేశించారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు చాంబరులో నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల్లో తక్కువ ఖర్చుతో సుమారు 50 ఎకరాలకు నీరందించే వాటర్ షెడ్ల నిర్మాణాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. ఇప్పటికే వాటికి మరమ్మతులు చేసి, వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. కనీసం ఒక పంటకు నీరందించేలా కొత్త ఆయకట్టుకు ప్రణాళిక రూపొందించాలని, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని సూచించారు. చెక్ డ్యాం నిర్మించి సోలారు మోటార్ల ద్వారా ఎగువ ప్రాంతానికి నీటిని పంపింగు చేసి, అక్కడ నుంచి కాలువల ద్వారా భూములకు నీరందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేయాలని తెలిపారు. కాలువల నిర్మాణ పనులను నరేగా నిధులతో చేపట్టాలని తెలిపారు. జూన్ 15కల్లా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆర్.అప్పలనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రక్తదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. గురువారం జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రారంభించి, రక్తదానం చేసిన విద్యార్థులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో గల మరొకరికి ప్రాణం కాపాడడం జరుగుతుందని, దీన్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా బలహీన పడతామనే అపోహను వీడాలని, రక్తదానం చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రానున్న వేసవిలో రక్త నిల్వలు తగ్గుతాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 30 యూనిట్లు రక్తం సేకరిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అగ్నిమాపక సిబ్బంది, భాస్కర కాలేజ్ డిగ్రీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.వాగ్దేవి, డాక్టర్. హరిజగన్ తదితరులు పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి



ఉక్కు కార్మిక సంఘాల నేతలతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాతంత్రవాదు లను మండలికి పంపిస్తే పేద, మధ్యతరగతి గొంతును, కార్మిక వాణిని వినిపిస్తారని చెప్పారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం లో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడుతుం దన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నిరంతరమూ ప్రజా సేవ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉక్కు కార్మికులను అభ్యర్థించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రమాప్రభ గెలుపంటే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడమేనని పేర్కొన్నారు. ఎఐసిటియు ప్రధాన కార్యదర్శి చిత్రాల సన్యాసిరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో ఉన్న పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. ప్రచారంలో డివిఆర్ఎస్ఇయు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, డిఐటియు నాయకులు సురేష్ కుమార్, సిపిఐ నాయకులు టి.కనకరాజు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రాజబాబు, సిఐటియు నాయకులు వైటి.దాస్, ఎం.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వం ాావు, బి.అప్పారావు, కెఎం శ్రీనివాసరావు, యూజ్ నాయకులు కామేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లాయర్లను, ఉద్యోగులను, సిబ్బందిని డాక్టర్ రమాప్రభ కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

జెఎన్‌టియులో సాంకేతిక విద్యాసదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో జరుగుతున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక సదస్సును వైస్ ఛాన్సలర్ వెంకట్ సుబ్బయ్య గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రతి ఏటా సంవత్సరం విడుదల చేసే మ్యాగజైన్‌ను ఈసందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ఇతర విభాగంలో ఉన్న ముఖ్యమైన కోర్సులపై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులకు వచ్చిన సృజనాత్మక ఆలోచనలను పుస్తక రూపంలో తీసుకువచ్చే కాపీరైట్స్ ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ విజయకుమార్ సాహు తృతీయ సంవత్సరం విద్యార్థి వై.సాయి ఆదిత్య రచించిన పుస్తకం 'హ్యూమన్స్ ఆరీ డేంజర్స్ జోన్'ను ఆవిష్కరించారు. ఫ్యాకల్టీ కోఆర్డనేటర్ డిఆర్‌డివి శివరాం మాట్లాడుతూ 234 మంది సాంకేతిక సదస్సులో వారి పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, సైన్సు విభాగాధిపతి పి.అటన్‌కమార్, ఆర్‌డిడివి శివరామ్, స్టూడెంట్ కోఆర్డినేటర్ తేజశ్వని తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

పాలకొండ రూరల్ : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాలకొండ, సీతంపేట, భామిని మండల కేంద్రాలలో సమావేశం నిర్వహించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భవిష్యత్ పోరాటా లకు సిద్ధం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతి నెలా జీతం సకాలంలో అందక, ఉద్యోగ భద్రత లేక పని భారంతో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర వేదనకు గురవుతున్నారన్నారు. ఎస్ఎస్ఎ అభియాన్‌లో సిబ్బందికి అనేక ఏళ్లుగా కనీసవేతనాలు అమలు చేయడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కార్యదర్శి బివి రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యల పరిష్కారానికే ఉద్యమం

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

పార్వతీపురం: కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తప్పని పరిస్థితుల్లో ఉద్యమిస్తున్నామని ఎపి జెఎసి జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామ్మూర్తి అన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆయన, భోజన విరామ సమయంలో సహోద్యోగులతో కలిసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం దశలవారీగా ఏప్రిల్ 3 వరకు కొనసాగిస్తామని, ఏప్రిల్ 5న రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కీలక ాినిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు రోజు రోజుకు దయనీయం పరిస్థితి ఎదుర్కొంటున్నారని, పనిచేసిన కాలానికి ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించండి మహాప్రభో అని అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ పరిస్థితి ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో కార్యాచరణ ప్రకటించాల్సి వచ్చిందని అన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇంకా జాప్యం చేస్తే ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు జరిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న ఈ ఉద్యమానికి అందరి మద్దతు ఉండాలని పిలుపునిచ్చారు.

పార్వతీపురం టౌన్ : ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్, ఎపి రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ అధ్యక్షులు కృష్ణమోహన్ పిలుపుమేరకు మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు.

పాలకొండ : సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర రెవెన్యూ సంఘం పిలుపు మేరకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు ఎం.సావిత్రి మాట్లాడుతూ సకాలంలో ప్రభుత్వం జీతాలు చెల్లించాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పనిఒత్తిడిని తగ్గించాలన్నారు.

వీరఘట్టం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐ ఎస్ మారుతీ రావు, విఆర్ఒలు జి. అప్పలనాయుడు, సురేష్ కుమార్, రాజేంద్రప్రసాద్, పి. రఘుకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఉద్యోగ సంఘాల జెఎసి అమరావతి నాయకులు డిజి ప్రసాద్ ఆధ్వర్యాన మున్సిపల్, ఆర్టీసీ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు రామ్ గోపాల్, పివిటి రాఘవాచార్యులు, ఆర్‌టిసి ఉద్యోగుల సంఘం నాయకులు ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

సాలూరు : మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాలకొండ : ఆర్‌డిఒ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రోడ్డు విస్తరణ కలేనా?

ఇరుకు రోడ్లతో ప్రయాణికులకు అవస్థలు

కురుపాం వద్ద నిలిచిపోయిన రోడ్డు పనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం రోడ్డు విస్తరణ పనులు ఆగ్రామస్తులకు కలగానే మిగిలాయి. తోటపల్లి నుంచి కురుపాం వరకు సుమారు 14 కిలోమీటర్ల చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోవడంతో ఇటు ప్రయాణికులు, అటు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిరాయితీ భూముల్లో రోడ్డు నిర్మించొద్దని భూమి హక్కులదారులు అభ్యంతరం తెలపగా, మరోవైపున ఉన్న పేదలను మా ఇళ్లను కూల్చొద్దంటూ అభ్యంతరం తెలపడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయి.

గరుగుబిల్లి మండలం తోటపల్లి నుంచి కురుపాం వరకు 14 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు రూ.40.50 నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నారు. సరిగ్గా కురుపాం పట్టణంలో రహదారి విస్తరణ జరుగుతుండగా, అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి ఎడమ వైపు మాత్రమే ఆర్‌అండ్‌బి స్థలం ఉందని, కుడివైపు అంతా జరాయితీ భూమి ఉందని, కావున ఎడమ వైపు మాత్రమే రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ నివేదికలో ఉన్న ప్రకారం పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. దీంతో ఆశాఖ అధికారులు ఎడమ వైపు రహదారి విస్తరణ పనులు ప్రారంభించగా, అటువైపున నివసిస్తున్న ప్రజలంతా రహదారి పనులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు పనులను అక్కడితో నిలిపివేశారు. నిత్యవసర సరుకులు, ఆరోగ్య సమస్యలు బాధపడేవారు సామాజిక ఆరోగ్య కేంద్రానికి, విద్యార్థుల చదువు నిమిత్తం, కార్యాలయాలకు పనుల నిమిత్తం, ఏ చిన్న అవసరం వచ్చిన చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తప్పనిసరిగా కురుపాం రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కురుపాంలో ఇరుకు రోడ్లతో వాహనదారులు, ప్రజలు, అత్యవసర వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణ పనులు జరిగితే ట్రాఫిక్ సమస్యలు ఉండవని ప్రజలు ఆశాభావంగా ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పుడు ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో స్థానికులు నిరాశతో ఉన్నారు. ఈ సమయంలోనే రోడ్డు విస్తరణ పనులు జరగకపోతే మరెప్పుడైనా జరిగే పరిస్థితి ఉంటుందో, ఉండదోననే ప్రజలను అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకొని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛనర్ల సమస్యలపై వినతి

విజయనగరంటౌన్ : అపరిష్కృతంగా పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని గురువారం రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2018 జులై నుంచి బకాయి ఉన్న డిఆర్, ఎరియర్లు వెంటనే చెల్లించాలన్నారు. పిఆర్‌సి ఎరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. 11వ పిఆర్‌సిలో ఉన్న పలు అసంబద్ధతల సవరణలకు కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదిన పింఛను జమ చేయాలని డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో మరో జింక మృతి

సీతానగరం : మండలంలో గత ఆదివారం కుక్కల దారిలో కృష్ణలంక మృతి చెందిన సంఘటన మరకముందే మరో జింకను కుక్కలు పొట్టను పెట్టుకున్నాయి. పార్వతీపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.మనోజ్ ఇచ్చిన వివరాలిలా ఉన్నాయి. ఎండలు తీవ్రం కావడంతో నీటి కోసం కొండపై నుంచి జోగంపేట హాస్టల్ వద్దకు జింకలు వస్తున్నాయన్నారు. ఇదే సమయం లో కుక్కలకు దాడి చేయడంతో జింక మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ రామారావు జింకకు శవ పంచనామా నిర్వహించి ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఖననం చేయడం జరిగింది.

జింకను ఖననం చేస్తున్న అధికారులు

ఎస్‌టిఒ శంకరరావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల సమస్యలపై ఎస్‌టిఒకి వినతి

కురుపాం : పెన్షనర్ల సమస్యల పై కురుపాం మండల తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు టి. పాండురంగారావు ఆధ్వర్యంలో సభ్యులు గురువారం ఎస్‌టిఒ శంకర్రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి సమస్యలను సత్వరం పరిష్కంచాలన్నారు. పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జూలై 1, 2018 నుండి అరియర్లు బకాయిల సత్వరం చెల్లించి ప్రస్తుతం బకాయి ఉన్న డి ఆర్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు ఎం. ప్రకాష్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్స్

మిషన్‌ను ప్రారంభిస్తున్న డిడిఎం నాగార్జున

కురుపాం : ఆర్ట్స్ సంస్థ ద్వారా శానిటరీ ప్యాడ్స్ గిరిజన ప్రాంతంలో గిరిజన మహిళలకు, పాఠశాలలు, హెూటల్లో తక్కువ ధరకే అందజేస్తున్నట్టు నాబార్డ్ డిడిఎం నాగార్జున అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్ సంస్థలో శానిటరీ ప్యాడ్స్ తయారీ యంత్రం ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నెలసరి సమయంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని, అలాంటప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. కావున వారికి అవసరమైన శానిటరీ ప్యాడ్స్ ఆర్ట్స్ సంస్థ ద్వారా అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిజివి బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, వ్యవసాయ శాఖ ఎఒ నాగేశ్వరరావు, ఆర్ట్స్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అనూప్, సిబ్బంది ఎస్. సోనియా, మహిళలు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాలి

బలిజిపేట : మార్చి నెలాఖరుకు స్త్రీ నిధి రికవరీని శత శాతం పూర్తి చేయాలని ఎజిఎం ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 90శాతం వరకు స్త్రీ నిధి రికవరీ అయ్యిందని, కేవలం 10 శాతం మాత్రమే రికవరీ చేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. కేవలం 15 రోజులు మాత్రమే సమయం ఉందని, గ్రామస్థాయిలో విఒఎలు దృష్టి సాధించి శత శాతం రికవరీకి సహకరిస్తారని కోరారు. కార్యక్రమంలో డిపిఎం ప్రవీణ్‌కుమార్, ఎపిఎం ఉమామహేశ్వరరావు, క్లస్టర్ ఎపిఎం అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

పాలకొండ : ఇంటిపన్ను వంద శాతం వసూలు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్ను బకాయిలపై దృష్టి పెట్టాలన్నారు. కొత్తగా ఎవరైనా ఇంటిపన్ను వేసుకోవాల్సిన వారు ఉంటే అటువంటి వారిని కూడా గుర్తించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛత్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ డొంక త్రినాధులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పిస్తున్న గంగాధరరావు

ప్రకృతి వ్యవసాయంతో నేల తల్లికి బాగు

కురుపాం : మండలంలో మంతిని వలస క్లస్టర్ పరిధిలోగల పూతిక వలస, సీతంపేట గ్రామాల్లో గురువారం రైతు సాధికారత సంస్థ, జట్టు సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై సిఆర్‌పి గంగాధరరావు రైతులకు, మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 12 కేజులు 30 రకాల విత్తనాలు వేయడం వల్ల భూసారం పెరుగుతూ పంటకు ఎరువులు వాడకుండా చీడపురుగులు పట్టకుండా పంట నాశనం అవ్వకుండా ఉంటుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వల్ల నేల తల్లి బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సరోజినీ, నాగేశ్వరరావు, రామరాజ్యం, జానకి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

సాలూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10న సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యాన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు, సిపిఐ నాయకులు ఎస్.రామచంద్రరావు కోరారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

13న ప్రత్యేక సాధారణ సెలవు

ప్రజాశక్తి- విజయనగరం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు వీలుగా ఈ నెల 13న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నెల 12, 13 తేదీలలో పోలింగ్ స్టేషన్ల పరిధిలో లోకల్ హాలిడే ప్రకటించినట్లు వెల్లడించారు. జిల్లాలో పోలింగ్ జరుగుతున్న 72 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. మిగిలిన కార్యాలయాల విధులు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

విజయనగరానికి మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి- విజయనగరం

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం గజపతినగరం, మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఏర్పాటయ్యే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

జూదగాళ్లు అరెస్టు

సాలూరు రూరల్: మండలంలో అన్నమరాజు వలస పంచాయతీ పరిధిలోగల చీపురువలస గ్రామం వద్ద బుధవారం రాత్రి పేకాడుతుండగా ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రయోగమూర్తి గురువారం తెలిపారు. వారి వద్ద నుండి సుమారు రూ.40 వేలు నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా జూదం ఆడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

14న పాఠశాలల్లో డీ వార్మింగ్ డే

ప్రజాశక్తి- సీతంపేట

ఈనెల 14న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పక్కాగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. గురువారం పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, ఎంఇఒలు, ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1-19 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వాలని సూచించారు. 14వ తేదీన మాత్రలు వేసుకోలేని విద్యార్థులకు 18వ తేదీన వేయించాలని సూచించారు. ఈ ఆల్బెండజోల్ మాత్రల ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని అన్నారు. వైద్యాధికారులు వారి పీహెచ్‌సీల పరిధిలో ఉన్న పాఠశాలల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఏమైనా ఇబ్బందులు వస్తే వారికి అవగాహన కల్పించి, మాత్రలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ బి. జగన్నాధరావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ కె.విజయ పార్వతి, ఒఎస్‌డి ఎడ్యుకేషన్ ఎం యుగంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం: సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

సోమగండిలో ఫ్యామిలీ ఫిజిషియన్

మండలంలోని సోమగండి పంచాయతీలో గురువారం మర్రిపాడు వైద్యాధికారి జె.సాయిచరణ్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వడదెబ్బను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. అనంతరం జ్వరాలు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన పిఎంఎస్‌ఎంఎ పథకం ద్వారా గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు

పార్వతీపురం టౌన్ : గర్భిణులకు ఎటువంటి ఆరోగ్య సమస్య ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహన రావు అన్నారు. గురువారం స్థానిక బెలగాం చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మాతా శిశుసంరక్షణ కార్డులో వైద్య సిబ్బంది నమోదు చేసిన పరీక్షల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా గర్భిణులు ఆరోగ్య తనిఖీల కొరకు ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. అక్కడ అన్ని ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కాల్షియం మాత్రలు వేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసుపత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలు ఆరోగ్య దాయకమని, వేసవిరీత్యా తాగునీరు అందుబాటులో ఉంచుకుంటూ ఎప్పటికప్పుడు తాగాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులు మరింత జాగ్రత్తలు పాటించాలని, తగినంత విశ్రాంతి అవసరమని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గర్భిణుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి. పవన్, డాక్టర్ బి. నిహారిక, సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: సమావేశంలో మాట్లాడుతున్న పిఒ బి. నవ్య

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 30 మంది గర్భిణులకు వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, రక్తపోటు మధుమేహ వంటి వ్యాధి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అబియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఓ.శాంతికుమారి, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ మహిళదినోత్సవం పురస్కరించుకొని స్థానిక మండల కార్యాలయంలోని సమావేశం భవనంలో గురువారం ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ ఆధ్వర్యంలో ఎంపిపి మజ్జి శోభారాణితో సహా మహిళా ఉద్యోగినులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అంకిత భావంతో ఏడాది పొడవునా విధులు నిర్వహిస్తున్న మండల కార్యాలయ ఉద్యోగినుల సేవలు మరవలేనివని, వారికి జరిపిన ఈ సత్కారంతో మరింత ప్రోత్సాహంగా పనిచేసేందుకు స్ఫూర్తిని నింపుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాలకు చెందిన మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్వతీపురం: మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపిడిఒ

మక్కువ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక ఎంపిడిఒ దేవకుమార్ అధ్యక్షతన ఎపిఎం సన్నిబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిజివిబి ఫీల్డ్ ఆఫీసర్ ఆర్ అనూషను, ఎపిఒ ఎస్. ఈశ్వరమ్మను కూడా మహిళా గ్రామీణ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా సంఘాల సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

మక్కువ: మహిళలను సత్కరిస్తున్న ఎంపిడిఒ దేవకుమార్

పాచిపెంట : మహిళలు చైతన్యవంతమైనప్పుడే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని ఉద్యోగి, ఉపాధ్యాయురాలు కె.నాగమణి, వై.స్వర్ణలత అన్నారు. గురువారం స్థానిక ఆశ్రమ పాఠశాల వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని శాస్త్రీయ అవగాహనతో ముందుకెళ్లాలని, బాల్యవివాహాలను వ్యతిరేకించాలని అన్నారు. రిజర్వేషన్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళల పట్ల నేటికీ అన్ని రంగాల్లోనూ వివక్షత కొనసాగుతూనే ఉందని అన్ని రంగాల్లో ముందు ఉండే మహిళ ఎవరికీ తక్కువ కాదని అన్నారు. కావున మహిళలను గౌరవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలపై వివక్షత మానుకొని మహిళా అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యు.సునీత, బంగారు తల్లి, జి.చంద్ర, ఎం.పార్వతి, సుజాత పాల్గొన్నారు.

పాచిపెంట: మాట్లాడుతున్న టీచర్ నాగమణి

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పొల్ల సచివాలయాన్ని ఎంపిడిఒ కె. గీతాంజలి గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి మిషన్ అంత్యోదయ సర్వే శరవేగంగా పూర్తి చేయాలన్నారు. రోజుకు ఎన్ని సర్వీసులు అందిస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయనతో పాట కార్యదర్శి శేఖర్ తదితరులు ఉన్నారు.

11న వాహనాల వేలం

ప్రజాశక్తి- జియ్యమ్మవలస

నాటు సారతో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటో ఈనెల 11వ తేదీన వేలం వేయనున్నట్లు చినమేరంగి ఎస్ఐ జి. కళాధర్ తెలిపారు. 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పాలకొండ డిఎస్‌పి ఆధ్వర్యంలో వేలం వేస్తామని ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొని రూ. 1000 కాష్షన్ డిపాజిట్ చెల్లించాలని అన్నారు.

సమస్యలపై పోరాడే రమాప్రభను గెలిపించండి

పార్వతీపురంటౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల పరిష్కారంకై పోరాడే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలంటూ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ప్రచారం చేశాయి. ఈ మేరకు పట్టణంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 250 పైగా ప్రజా సంఘాల మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్, మోహనరావు, సింగన్న, జి.జనార్ధన, బొత్స మోహనరావు, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు, పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు ప్రచారం చేశారు.

పార్వతీపురం: ప్రచారం చేస్తున్న సిపిఐ నాయకులు

సీతానగరం: ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సాలూరు: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లోనూ యుటిఎఫ్, ప్రజాశక్తి సిబ్బంది రమా ప్రభకు మద్దతుగా ప్రచారం చేశారు.

కొమరాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు వి.ఇందిర, కె.సాంబమూర్తి మండలంలోని దుగ్గి, కల్లికోట, పాత కల్లికోట, చంద్రంపేట గ్రామాల్లో ప్రచారం చేశారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం, బూర్జ, విప్పలవలస, పాపం వలస గ్రామాలలో గురువారం పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమా ప్రభకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సింహాచలం, సిఐటియు నాయకులు జి వెంకటరమణ, డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్ కాలేజి ఫెస్ట్‌లో సత్తాచాటిన సాయి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

సాయిదీపక్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల(ఐతమ్)లో నిర్వహించిన పెస్ట్‌లో సివిల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న పాలకొండకు చెందిన సూరబత్తుల సాయిదీపక్ ప్రతిభ కనబర్చారు. సింగన్నవలస గ్రామానికి చెందిన సాయి దీపక్ భూకంపాలు నుంచి రక్షణ నిర్మాణాలపై ప్రయోగాన్ని వివరించారు. భూకంపాలు వచ్చే సమయంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలి, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలన్న అంశాలను కులంకుశంగా వివరించారు. పెస్ట్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలలో సాయిదీపక్‌కు ప్రయోగం అందరికీ ఆకర్షించింది. సాయిదీపక్ ప్రజెంటేషన్‌కు హెచ్‌ఒడి పి.దినకర్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు. పాలకొండ ప్రాంతానికి చెందిన సాయిదీపక్ మంచి ప్రయోగాన్ని చూపించి అందరి మన్ననలు పొందడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

15నుంచి అగ్రిగోల్డ్ బాధితుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెల 15,16,17 తేదీల్లో అగ్రిగోల్డ్ బాధితులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్షలు, సత్యాగ్రహ కార్యక్రమాల నిర్వహణకు అగ్రిగోల్డ్ బాధితులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు కోరారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తుల విక్రయానికి సత్వరమే ప్రభుత్వం ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి సాలాపు అనంతరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎపి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 18,19వ వార్డు సమీకృత అంగన్వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అందించేందుకు వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రానికి హాజరైన ప్రీ-స్కూలు పిల్లలకు నేర్పుతున్న ఆటలు, పాటలు పాడించారు. అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణీలకు, బాలింతలకు న్యూట్రిషన్ కిట్లు, పాలు, గుడ్లు, ఒక పూట సంపూర్ణ పోషకాహారం మెనూ ప్రకారం అందించడంతో పాటు వారికి ఇమ్యునైజేషన్, నెలవారీగా ఆరోగ్య తనిఖీలు చేస్తూ, అవసరమైన మందులు సరఫరా చేయాల్సిందిగా ఆదేశించారు. బరువు తక్కువ గల పౌష్టికాహార లోపానికి గురైన పిల్లలు, రక్తహీనత, ప్రమాద స్థితికి గురి కాగల తల్లుల పోషణ, ఆరోగ్య విషయమై ఎక్కువ జాగ్రతలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల బోర్డులను పెద్దగా అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కేసలి అప్పారావు

బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బాలల హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వారి హక్కుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉందని బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. గురువారం స్థానిక ఎపి ఎన్జీవో హెూంలో మైచాయిస్ ఫౌండేషన్, రెడ్అలెర్ట్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా బాలహక్కులు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, బాల్య వివాహాలు నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్‌నేరాలు, బాలకార్మికుల నిర్మూలనతో పాటు పలు అంశాలపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకులు మంచిపల్లి శ్రీరాములు, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు పాల్గొని పలు సామాజిక అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సురక్షి గ్రామజ్యోతి కార్యక్రమానికి చెందిన 50 గ్రామాలకు చెందిన గ్రామ మిత్రలు, గ్రామరక్షకులు, నోడల్ టీచర్లతో పాటు మైచాయిస్ సంస్థ ప్రతినిధి, ఎపి తెలంగాణ కోఆర్డినేటర్ క్రాంతి, దిశ మహిళా ఎస్ఐ సంతోషి, సిఐఒ పద్మ, ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

పార్వతీపురం : స్కూటీ అంతర్భాగంలో నాటుసారా రవాణా చేస్తూ అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఇబి సిఐ ఉపేంద్ర తెలిపారు. మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన సంతోష్ అలియాస్ వంశీ అను వ్యక్తి ఒడిషా రాష్ట్రం అలమండ నుండి నాటు సారా ప్యాకెట్లును తీసుకొని వచ్చి సదురు గ్రామంలో అమ్ముతున్నాడనే సమాచారం మేరకు గ్రామ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి వంశీని అదుపులోకి తీసుకున్నామ న్నారు. స్కూటీని తనిఖీ చేయగా బాడీ ముందు బాగంలో, ఇంజిన్ దగ్గర అడుగు బాగంలో చాలా తెలివిగా నాటు సారా ప్యాకెట్లు అమిర్చి రవాణా చేస్తూ విక్రయిం చడంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 250 నాటుసారా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో కృష్ణపల్లి సమీపంలో పాత రెల్లివీధికి చెందిన సొండి సాయిని కూడా అరెస్టు చేసి అతని వద్ద నుంచి 100 సారా ప్యాకెట్లు, 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు శేఖరం, రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులు పాల్గొన్నారని సిఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

వీరఘట్టం : మండల పరిధి వండవ గ్రామ సమీపంలో గురువారం కారు అదుపుతప్పి తుప్పల్లోకి వెళ్ళి పోయింది. మండల కేంద్రంలోని తెలగ వీధికి చెందిన యామల శేఖర్ విజయనగరం జిల్లా చీపుర పల్లిలో తన అక్క కొడుకుకు గురువారం వేకు జామున వివాహం చేసి కొడుకును కోడలను కారులో వీరఘట్టం తీసుకువస్తుండగా వండవ గ్రామ సమీపనికి వచ్చేసరికి రెప్పపాటు కునుకు తీయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని అదుపు తప్పిన కారును బయటకు తీశారు.

స్పందించారు..తొలగించారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేటలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం వద్ద సిఎం జగన్ ఫ్లెక్సీని గురువారం తొలగించారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న నేపథ్యంలో వెల్‌నెస్ కేంద్రం వద్ద సిఎం ఫెక్సీని తొలగించకపోవడంపై 'ఎన్నికల కోడ్ వర్తించదా..?' అనే శీర్షికతో గురువారం 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి, వెంటనే తొలగించారు.

ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు
O.S. No.103/2022

Between:-
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బెలగాం బ్రాంచ్) .....వాది
And:
1. సామల స్వాతి, పక్కి సింహాచలం ....ప్రతివాదులు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన వాది గారు ప్రతివాదులపై దావాలో తెలిపిన బాకీ రాబెట్టుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. ప్రతివాదులైన మీకు పలుమార్లు దావా సమన్లు కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా అనేకమార్లు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ పూర్వకంగా సమన్లు అందుకొనుటకు తప్పించుకుని తిరుగుతున్నారు. కావున ఈ ప్రకటన సమనలుగా భావించి **తే.20-03-2023 దీ**న మీరు స్వయంగా లేదా వకీల్ ద్వారా ఖుద్దున గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలపగలరు లేనిచో మీ పరోక్షమున దావా డిక్రి మరియు జడ్జిమెంట్ జారీ కాబడును.

కోర్టు ఉత్తర్వుల మేరకు

గొర్లి వెంకటరావు
వాది తరపు న్యాయవాది
అడ్వకేట్- పార్వతీపురం,
సెల్ :-9440343572.